# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME : 93 EDITOR:CHERUKU UPENDAR, DATE : FRIDAY 04 AUGUST 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 93 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : శుక్రవారం 04 ఆగస్టు 2023 పేజీలు : 4 వెల : 5/-

## ఆర్థిక మాంద్యంలో అగ్రరాజ్యం



వాషింగ్టన్- ప్రభాత సూర్యుడు

అమెరికా.. అగ్రరాజ్యం.. నంబర్ వన్ కంట్రీ! అక్కడ పెట్టుబడి పెడితే డబ్బుల పంట పండుతుందన్న నమ్మకం! కానీ ఇప్పుడా పరిస్థితి మారిపోయింది. ఫిచ్ రేటింగ్స్ యూఎస్ క్రెడిట్ రేటింగ్‌ను తగ్గించింది. ఏఏఏ నుంచి ఏఏ+ కు

మిగతా 2లో...

## సిట్టింగ్‌లకు.. ఫిట్టింగ్‌లు..!

### పావులు కదుపుతున్న నేతలు






నల్గొండ- ప్రభాత సూర్యుడు

అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతోంది. దీంతో టికెట్ ఆశిస్తున్న నేతలు? ఎవరికి వారిగా ప్రయత్నాలు చేసుకుంటున్నారు. సిట్టింగ్ లకు ఫిట్టింగ్ పెట్టేలా కొందరు నేతలు పావులు కదుపుతున్నారు. ఇదే సీన్ యాదాద్రి జిల్లాలోని ఆలేరులో కనిపిస్తోంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతోంది. ప్రధాన పార్టీలన్నీ గెలుపు గుర్రాలపై ఫోకస్ పెట్టాయి. మొన్నటి వరకు ఆపరేషన్ ఆకర్ష్ తో కాంగ్రెస్ దూకుడు పెంచితే... ఇక మా వంతు అన్నట్లు బీఆర్ఎస్ కూడా షురూ చేసింది. కీలక నేతలతో టచ్ లో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ప్రధాన ప్రత్యర్థి పార్టీల్లో అలజడి మొదలైందన్న వార్తలు కూడా వినిపిస్తున్నాయి. త్వరలోనే చాలా సమీకరణాలు మారే ఛాన్స్ కనిపిస్తోంది. ఇక సిట్టింగ్ లకే టికెట్లు ఇస్తామంటూ పలుమార్లు ప్రకటనలు చేసిన గులాబీ బాస్ కేసీఆర్... చాలా మందికి హ్యాండ్ ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.
ఇప్పటికే 25 నుంచి 30 మంది ఎమ్మెల్యేల పేర్లు కూడా

మిగతా 3లో...

ఫాస్టాగ్ స్థానంలో...

## మరో విధానం



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

దేశంలోని జాతీయ రహదారులపై టోల్ ప్లాజాల వద్ద త్వరలో సరికొత్త కొత్త టోల్ వ్యవస్థను అమలు చేయనున్నట్టు కేంద్ర రహదారుల శాఖ సహాయ మంత్రి వీకే సింగ్ తెలిపారు. బుధవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న ఫాస్టాగ్ వ్యవస్థ స్థానంలో కొత్త వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. రహదారులపై ఓపెన్ టోల్ సిస్టమ్ అమలును ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ నూతన వ్యవస్థ ద్వారా సామర్థ్యం మెరుగుపడటంతో పాటు ప్రయాణ సమయం తగ్గుతుందన్నారు. కిలోమీటర్ల ఆధారంగా చెల్లింపులు చేయొచ్చని తెలిపారు. ఇది

మిగతా 2లో...

## రైతుల రుణమాఫీ ప్రక్రియ ప్రారంభం

### మొదటి రోజు రూ. 37 వేల నుంచి రూ. 41 వేల మధ్య ఉన్న రైతుల రుణాలు మాఫీ

### దీంతో 44,870 మంది రైతులకు లబ్ధి



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణలో రైతుల రుణమాఫీ ప్రక్రియ ప్రారంభమైంది. రుణమాఫీ చెల్లింపులకు ఆర్థిక శాఖ నుంచి రూ. 167.59 కోట్లు విడుదలయ్యాయి. గురువారం రూ. 37 వేల నుంచి రూ. 41 వేల మధ్య ఉన్న రైతుల రుణాలు మాఫీ అయ్యాయి. దీంతో 44,870 మంది రైతులకు లబ్ధి చేకూరింది. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి కేసీఆర్‌కు వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి తెలంగాణ రైతుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు పంట రుణాల మాఫీని పూర్తిచేయనున్నట్టు సీఎం కేసీఆర్ బుధవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. రూ.లక్షలోపు రైతుల పంట రుణాలను మాఫీ చేస్తామని 2014లో ఇచ్చిన హామీని సీఎం కేసీఆర్ తు.చ తప్పకుండా నెరవేర్చారు. 2018లో మరోసారి రుణమాఫీ హామీ ఇచ్చారు. 2014లో ఇచ్చిన హామీ మేరకు రూ. 36 వేల వరకు ఉన్న రుణాలను మాఫీ చేశారు. తాజాగా మిగిలిన రుణాల మాఫీకి పచ్చజెండా ఊపారు. రుణమాఫీ పున:ప్రారంభ ప్రక్రియ గురువారం నుంచే ప్రారంభించాలని, మొత్తం రుణాలను 45 రోజుల్లోగా అంటే సెప్టెంబర్ రెండో వారంలోగా పూర్తిచేయాలని ఆర్థిక శాఖ మంత్రి

మిగతా 2లో...

డిసెంబర్ మొదటి వారంలో

## ఎన్నికలు..?



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర అధికారులకు సంకేతాలు ఇచ్చినట్టు సమాచారం. అక్టోబర్ రెండో వారం తర్వాత షెడ్యూల్ రిలీజ్ అవుతుందని, డిసెంబర్ ఫస్ట్ వీక్‌లో పోలింగ్ ఉంటుంది తెలుస్తున్నది. ఈ మేరకు ఎన్నికల పక్రియకు కావాల్సిన ఏర్పాట్లు చేసుకోవాలని ఎన్నికల కమిషన్ రాష్ట్ర అధికారులకు సూచించినట్టు సమాచారం. ఎలక్షన్ పక్రియకు సంబంధించి ఎన్నికల సంఘం నుంచి స్టేట్ ఆఫీసర్లకు రోడ్ మ్యాప్ వచ్చినట్టు విశ్వసనీయ

మిగతా 2లో...

మనీలాండరింగ్ కేసులో

## ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మరోసారి దాడులు




చెన్నై - ప్రభాత సూర్యుడు

మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తమిళనాడులో గురువారం మరోసారి దాడులు చేసింది. మంత్రి సెంథిల్ బాలాజీకి సంబంధించిన కేసులో దాడులు నిర్వహించినట్లు తెలుస్తున్నది. కోయంబత్తూరు,

మిగతా 2లో...

## టీ కాంగ్రెస్‌లో బీసీ లొల్లి



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ కాంగ్రెస్‌లో ఎప్పుడూ ఏదో ఒక లొల్లి కామన్.. ఇప్పుడు మరో సరికొత్త విషయం అగ్గిరాజేసింది. ఇది తెలంగాణ వరకే పరిమితం కాలేదు.. ఏపీ నుంచి నుంచి కూడా పొగ వస్తుండటం ఇప్పుడు.. పార్టీలో పెద్ద తలనొప్పిగా మారింది. కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌ఛార్జ్ మాణిక్ రావు థాక్రే.. నేరుగా వైసీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్యను కలవడంపై కాంగ్రెస్‌లో భిన్న వాదనలు మొదలయ్యాయి. పార్టీలో ఇప్పటికే బీసీ నేతలు.. బీసీ ఏజెండాతో పని చేస్తున్న నేపథ్యంలో.. థాక్రే పార్టీ నేతలను కాదని బయటి వ్యక్తితో చర్చలు జరపడం ఏంటంటూ లోలోన రగిలిపోతున్నారని టాక్.. పార్టీలో ఉన్న నేతలతో సంప్రదింపులు చేయకుండా.. వేరే పార్టీ నేతతో భేటీ కావడంలో మతలబు ఏంటంటూ ఆవేదన చెందుతున్నట్లు గాంధీ భవన్

మిగతా 2లో...

## పథకాలు సరే.. నిధులెలా..!



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ఉన్న పథకాలను కొనసాగిస్తాం... అంతకు మించిన పెద్ద మేనిఫెస్టో ఏమీ ఉండదు మాకు అని 2018 లో ముందస్తు ఎన్నికలకు వెళ్లే సమయంలో కేసీఆర్ చెప్పారు. అప్పటికే రైతు బంధు ప్రారంభించేశారు. పూర్తిగా పాజిటివ్ వాతావరణం ఉంది. కాంగ్రెస్ మేనిఫెస్టో వచ్చిన తర్వాత... రుణమాఫీ, నిరుద్యోగ భృతి వంటి హామీలు ఇచ్చారు. కానీ 2023 ఎన్నికలకు వెళ్తున్న సమయంలో కేసీఆర్ తీసుకుంటున్న నిర్ణయాలు మాత్రం పటాసుల్లా పేలుతున్నాయి. రోజుకో నిర్ణయంతో సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ ఇచ్చిన హామీ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం. ఆర్టీసీ ఉద్యోగులు చూసీ చూసీ కేసీఆర్ రెండో సారి గెలిచిన తర్వాత 2019 అక్టోబర్‌లో సమ్మెకు దిగారు. కానీ కేసీఆర్ అప్పుడు ఎంత కఠినంగా వ్యవహరించారంటే ఆర్టీసీ ఉద్యోగులంతా సెల్ఫ్ డిస్మిస్ చేసేసుకున్నారని ప్రకటించేశారు. చివరికి కేసీఆర్ స్టైల్లో కనికరించారు.. దీంతో తమ ఉద్యోగాలు మిగిలాయని చెప్పి అందరూ పాలాభిషేకాలు చేసి డ్యూటీ చేసుకుంటున్నారు. మరో సారి సమ్మె అనే ఆలోచన చేయలేదు. కానీ ఎన్నికలకు ముందు హఠాత్తుగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. రైతులకిచ్చిన రుణమాఫీ హామీ నాలుగున్నరేళ్లుగా పెండింగ్‌లో ఉంది. ఎన్నికల ఏడాదిలో పూర్తి చేయాడనికి బడ్జెట్‌లో రూ. 6,385 కోట్లు కేటాయించారు. 2018 ఎన్నికల్లోనూ పంట

మిగతా 2లో...

ఎంపీలతో..

## ప్రధాని భేటీ



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది దేశ రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ఎన్‌డీఏ వర్సెస్ ప్రతిపక్షాల ఫైట్ ఫిక్స్ అయిపోయింది. రెండు కూటములు అస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే ప్రధాని నరేంద్ర మోదీ

మిగతా 2లో...

## ఎంపీలతో..
# ప్రధాని భేటీ

(మొదటిపేజీ తరువాయి)

ఎంపీలకు సక్సెస్ మంత్రాలు ఉపదేశించారు. అందులో ప్రధానంగా ఓ అంశంపైనే చర్చించారు. ప్రతిపక్షాలు ఏ విషయంలో అయినా సరే ఎన్ని విమర్శలు చేసినా, ఎంత రెచ్చగొట్టినా పొరపాటున కూడా నోరు జారి మాట్లాడొద్దని సూచించారు మోదీ. ఎన్‌డీఏ లోని ఎంపీలతో విడతల వారీగా సమావేశమవుతున్న ప్రధాని...పలు రాష్ట్రాలకు చెందిన 45 మంది ఎంపీలతో ఇటీవలే భేటీ అయ్యారు. పేదల కోసమే పని చేయాలని సూచించారు. అదే సమయంలో ప్రతిపక్షాలు ఇస్తున్న ఉచిత హామీలపైనా ప్రజలకు అవగాహన కల్పించాలని, వాటిని వ్యతిరేకించాలని తెలిపారు. ఎన్నికల్లో గెలవడానికి అన్ని విధాలుగా కష్టపడాలని, ముఖ్యంగా నోరు అదుపులో పెట్టుకోవాలని సుతిమెత్తగా హెచ్చరించారు. "ప్రతిపక్షాలు విమర్శిస్తాయి. పరిధి దాటి మాట్లాడతాయి. కావాలనే రెచ్చగొడతాయి. అయినా సరే మీరు మాత్రం మీ మాటలు తూలనివ్వకండి. అనవసరపు వివాదాల్లో చిక్కుకోకండి. ఇండియా కూటమిని గట్టిగా ఎదుర్కోవాలి. నిజానిజాలేంటే ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలి. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలపై దృష్టి పెట్టండిదక్షిణాది రాష్ట్రాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంపీలకు సూచించడం వెనక ఓ కారణముంది. గతంలో ఎన్‌డీఏ ఈ రాష్ట్రాల్లో పెద్దగా ప్రభావం చూపించలేకపోయింది. స్థానికంగా క్యాడర్ లేకపోవడం వల్ల ఓట్లు రాబట్టుకోలేకపోయింది. అందుకే ఈ సారి ఇక్కడి ఓటర్లకు దగ్గరవ్వాలని ప్లాన్ చేస్తున్నారు మోదీ. ఈ 9 ఏళ్లలో తమ ప్రభుత్వం ఏం చేసిదో ప్రజలకు వివరించాలని మోదీ ఎంపీలకు సూచించారు. లోక్‌సభ నియోజకవర్గాల్లో యాక్టివ్‌గా ఉండాలని చెప్పారు. సోషల్ మీడియాలోనూ పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని సలహా ఇచ్చారు. అవసరమైతే ఎక్స్‌పర్ట్స్ సూచనలు తీసుకుని మరీ క్యాంపెయినింగ్ చేయాలని ఎంపీలకు చెప్పారు. కొత్త ప్రాజెక్ట్‌లపై దృష్టి పెట్టడం కన్నా ఇప్పటి వరకూ చేసింది చెప్పుకుంటే చాలని అన్నట్టు బీజేపీ శ్రేణులు వెల్లడించాయి. అందరూ గ్రౌండ్ లెవెల్‌లో పని చేసి ప్రజల మెప్పు పొందాలని సూచించినట్టు తెలిపాయి. ప్రస్తుతానికి బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమిలో 430 మంది ఎంపీలున్నారు. వీళ్లను 11 గ్రూప్‌లుగా విభజించింది బీజేపీ. జులై 31వ తేదీ నుంచి వరుస పెట్టి సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆగస్టు 10వ తేదీ వరకూ ఇవి కొనసాగనున్నాయి. ఇటీవలే ఉత్తర ప్రదేశ్ ఎంపీలతో ప్రధాని సమావేశమయ్యారు. రామమందిరం మినహా.. ఇతర సమస్యలపై ఎంపీలు దృష్టి సారించాలని సూచించారు. తరచూ ప్రజల్లోకి వెళ్లాలని, వారితో మమేకం అవ్వాలని, ప్రజలతో ఎక్కువ సమయం గడపాలని సూచించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఎంపీలతో సమావేశంలో యూపీఏపై విమర్శలు గుప్పించారు ప్రధాని. యూపీఏ స్వార్థం గురించి ఆలోచిస్తే,, ఎన్డీఏ సంకీర్ణ ధర్మాన్ని పాటిస్తుందన్నారు. యూపీఏ మాదిరి కాకుండా ఎన్డీఏ త్యాగాలకు సిద్ధంగా ఉంటుందన్నారు.

## ఫాస్టాగ్ స్థానంలో...
# మరో విధానం

(మొదటిపేజీ తరువాయి)

విజయవంతం అయితే వెంటనే అమల్లోకి తీసుకువస్తామని మంత్రి వెల్లడించారు. అత్యాధునిక సాంకేతికతతో కూడిన ఈ వ్యవస్థ అమల్లోకి వస్తే ప్రయాణికులు ఇకపై టోల్ ప్లాజాల వద్ద వెయిట్ చేయల్సిన అవసరం ఉండదని చెప్పారు. గతంలో నగదు చెల్లింపులతో చాలా సమయం వృథా అయ్యే దని, ఫలితంగా వాహనాలు కిలోమీటర్ల మేరకు వేచి ఉం డాల్సి వచ్చేదన్నారు. దాని స్థానంలో ఫాస్టాగ్ వ్యవస్థను అందు బాటులోకి తీసుకువచ్చామన్నారు. దీంతో టోల్ ప్లాజాల వద్ద వాహనాలు వేచి ఉండే సమయాన్ని కేవలం 47 సెకన్లకు తగ్గించగలిగామన్నారు. భవిష్యత్తులో ఆ సమయాన్ని 30 సెకన్ల కంటే తక్కువకు తగ్గించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి చెప్పారు. ఉపగ్రహ, కెమెరాలు వంటి సాంకేతికతల ఆధారితంగా పనిచేసే ఈ నూతన టోల్ వ్యవస్థను ప్రస్తుతం ఢిల్లీ–మేరఠ్ ఎక్స్‌ప్రెస్‌వేలో పైలట్ ప్రాజెక్టు కింద పరీక్షి స్తున్నట్టు మంత్రి తెలిపారు. వాహనాలు జాతీయ రహదారిపైకి ప్రవేశించినప్పుడు టోల్ ప్లాజా వద్ద రిజిస్ట్రేషన్ ప్లేట్‌ను కెమెరా స్కాన్ చేసి డేటాను క్రోడీకరిస్తుందని ప్రయా ణించిన కిలోమీటర్లకు ఛార్జీలు విధిస్తుందని మంత్రి చెప్పారు. టెలికాంతో పాటు అన్ని రంగాల్లో ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న కృషి ఫలితంగానే ఇలాంటి సాంకేతిక పురోగతి సాధ్య మవుతోందని మంత్రి పేర్కొన్నారు. టెలి కమ్యూనికేషన్స్ రంగం అన్ని ఇతర రంగాలతో అనుసంధానమై ఉందన్నారు మార్చిలో ఢిల్లీలో సీసీఐ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ ఇదే అంశంపై మాట్లాడారు. జాతీయ రహదారులపై టోల్ ఫీజు వసూలుకు జీపీఎస్–ఆధారిత వ్యవస్థను ఆరు నెలల్లో తీసుకొస్తామని ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న టోల్ ప్లాజాల స్థానంలో వాటిని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. దీనివల్ల ట్రాఫిక్ ఇబ్బందులను తప్పడంతో పాటు, ప్రయాణించిన దూరానికే ఫీజు వసూలు చేయడం వీలుపడుతుందని చెప్పారు. ప్రస్తుతం టోల్ ఫీజు వసూళ్ల ద్వారా జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఔఊంఎ)కు ఏటా రూ.40 వేల కోట్లు ఆదాయం వస్తోందని, రాబోయే రెండు మూడేళ్లలో ఆదాయం రూ.1.40 లక్షల కోట్లకు పెరుగుతుందని గడ్కరీ అన్నారు. 2018–19 నాటికి టోల్ ప్లాజాల వద్ద ఒక్కో వాహనం సగటున 8 నిమిషాల పాటు వేచి ఉండాల్సి వచ్చేదని, ఫాస్టాగ్ అమల్లోకి వచ్చాక ఆ సమయం సగటున 47 సెకన్లకు తగ్గిందని వివరించారు.

# రైతుల రుణమాఫీ ప్రక్రియ ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

హరీశ్‌రావును సీఎం ఆదేశించారు. రుణాల చక్ర బంధంలో ఇరుక్కొని రైతులు పడే కష్టాలు అన్నీఇన్నీ కావు. అందుకే రైతులను రుణ విముక్తి చేయాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ పంట రుణాల మాఫీని అమలు చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలి ఎన్నికల్లోనే రూ.లక్ష వరకు పంట రుణాల మాఫీని ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం తొలి విడత ప్రభుత్వంలో మొత్తం 35.31 లక్షల మంది రైతులకు సంబంధించిన రూ.16,144 కోట్ల పంట రుణాలను మాఫీ చేశారు.

ఈసారి సుమారు 29.61 లక్షల మంది రైతులకు సంబంధించిన రూ.19 వేల కోట్ల రుణాలను ప్రభుత్వం మాఫీ చేయనున్నది. తొలి రెండు దఫాల్లో మొత్తం 40.74 లక్షల మంది రైతులకు సంబంధించిన రూ.17,351 కోట్ల పంట రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. తాజా రుణమాఫీని కూడా కలిపితే ఇది సుమారు రూ.36 వేల కోట్లకు చేరనున్నది. తాజా రుణమాఫీతో సుమారు 29.61 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరనున్నది.

# ఆర్థిక మాంద్యంలో అగ్రరాజ్యం

(మొదటిపేజీ తరువాయి)

సవరించింది. దాంతో ప్రపంచ వ్యాప్తంగా ప్రకంపనలు మొదలయ్యాయి. స్టాక్ మార్కెట్లు విలవిల్లాడుతున్నాయి. ఇన్వెస్టర్లలో ఒక్కసారిగా అపనమ్మకం, ఆందోళన మొదలయ్యాయి. రాబోయే మూడేళ్లలో ఆ దేశ ఆర్థిక వ్యవస్థ మరింత క్షీణిస్తుందని ఫిచ్ అంచనా వేయడం కలకలం రేపుతోంది. ఫిచ్ రేటింగ్ సంస్థ అమెరికా రేటింగ్‌ను తగ్గించడం 2011లో ప్రభుత్వ అప్పుల పరిమితి నేపథ్యంలో స్టాండర్డ్ అండ్ పూర్ చర్యను తలపించింది. అనిశ్చితి వల్ల అప్పుడు యూఎస్ ట్రెజరీ రుణాల ఖర్చు 1.3 బిలియన్ డాలర్ల మేర పెరిగింది. ప్రస్తుత పరిస్థితీ అలాగే కనిపిస్తోంది. రేటింగ్ తగ్గించడం వల్ల అమెరికా అప్పుల భారం మరింత పెరగనుంది. రుణాల కోసం ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తుంది. ఏదేమైనా రేటింగ్‌ను డౌన్ గ్రేడ్ చేయడం ఆర్థిక నిపుణులను ఆశ్చర్యపరిచింది.'పన్నులు తగ్గించడం, కొత్త ప్రాజెక్టులకు ఖర్చు చేయడం, ఆర్థిక వ్యవస్థ అనిశ్చితి వంటివి అమెరికా బడ్జెట్ లోటును మరింత పెంచాయి. మధ్యకాలిక సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రణాళికలేమీ లేవు. అమెరికా క్రెడిట్ రేటింగ్ తగ్గించడం రాబోయే మూడేళ్లలో ఆర్థిక క్షీణతను ప్రతిబింబిస్తోంది' అని ఫిచ్ తెలిపింది. గత 20 ఏళ్లుగా పాలనా ప్రమాణాలు క్రమంగా పడిపోయాయని నొక్కి చెప్పింది. రుణ పరిమితి విషయంలో ఆఖరి నిమిషం వరకు రాజకీయ అనిశ్చితి కొనసాగుతోందని వెల్లడించింది. అమెరికా అప్పుల భారం 2025 నాటికి జీడీపీలో 118 శాతానికి పెరుగుతుందని ఫిచ్ అంచనా వేసింది. ౦౦౦ రేటింగ్ సరాసరి 39.3 శాతానికి ఇది 2.5 రెట్లు ఎక్కువని వివరించింది. జీడీపీతో పోలిస్తే అప్పుల నిష్పత్తి మరింత పెరగడం సుదీర్ఘ కాలంలో అమెరికా ఆర్థిక వ్యవస్థ మరింత క్షీణించేందుకు కారణం అవుతుందని తెలిపింది. భవిష్యత్తులో ఇది మరిన్ని షాకులు ఇస్తాయని వివరించింది. అమెరికా క్రెడిట్ రేటింగ్‌ను ఫిచ్ తగ్గిండంపై రాజకీయ నాయకులు, ఆర్థిక నిపుణులు భిన్నంగా స్పందిస్తున్నారు. 'అమెరికా వాసులు, ఇన్వెస్టర్లు, ప్రపంచ వ్యాప్తంగా ప్రజలకు అమెరికా ఎంత పటిష్ఠంగా ఉందో తెలుసు. ఫిచ్ నిర్ణయం వారిపై ఎలాంటి ప్రభావం చూపించదు. ప్రాథమికంగా అమెరికా ఎంతో పటిష్టంగా ఉంది. ట్రెజరీ సెక్యూరిటీ ప్రమాణాలు ప్రపంచంలోనే అత్యున్నతంగా ఉన్నాయి' అని యూఎస్ ట్రెజరీ సెక్రెటరీ జానెట్ యెలెన్ అన్నారు. మిగతా ఆర్థిక వేత్తలూ ఇలాంటి అభిప్రాయాలనే వ్యక్తం చేస్తున్నారు. అధికారంలో ఉన్న డెమొక్రాట్లు, ప్రతిపక్షంలో ఉన్న రిపబ్లికన్లు మాత్రం ఒకరిపై మరొకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. అమెరికా ఇలాంటి స్థితికి దిగజారడానికి 'బైడెనామిక్స్' కారణమని రిపబ్లికన్లు అంటున్నారు. అప్పుల పరిమితి అంశం సహా అన్నింట్లోనూ విఫలమయ్యారని ఆరోపించారు. డౌన్‌గ్రేడింగ్‌కు డొనాల్డ్ ట్రంప్ కారణమని డెమొక్రాట్లు అంటున్నారు. ఫిచ్ రేటింగ్ ప్రమాణాల్లో బైడెన్ ప్రభుత్వం మెరుగ్గా ఉందని పేర్కొంటున్నారు. అమెరికా క్రెడిట్ రేటింగ్ తగ్గించడం వల్ల రెండేళ్ల ట్రెజరీ యీల్డులు మూడు బేసిస్ పాయింట్ల మేర తగ్గి 4.87 శాతానికి చేరుకుంది. పదేళ్ల అమెరికా బాండ్లు ఒక బేసిస్ పాయింటు మేర పతనమై 4.01 శాతం వద్ద ఉన్నాయి. ఇక 30 ఏళ్ల అమెరికా డెట్ యీల్డు చివరి తొమ్మిది నెలల్లోనే అత్యధిక స్థాయికి చేరుకుంది. డోజోన్స్, నాస్‌డాక్, ఎస్అండ్‌పీ 500, నాస్‌డాక్ ఫ్యూచర్స్ సూచీలు క్రాష్ అయ్యాయి. ఆసియా, ఐరోపా మార్కెట్ల పైనా ఇలాంటి ప్రభావమే నెలకొంది.

# టీ కాంగ్రెస్‌లో బీసీ లొల్లి

(మొదటిపేజీ తరువాయి)

వర్గాల్లో వినిపిస్తోంది. మరోవైపు థాక్రే తీరుపై ఏపీ కాంగ్రెస్ నేతలు సైతం గుర్రుగా ఉన్నారని సమాచారంతెలంగాణలో ఎన్నికలు దగ్గర పడు తుండడంతో.. కాంగ్రెస్ పార్టీ అన్ని అస్త్రశస్త్రాలను సంధిస్తోంది. పార్టీ వైపు అన్ని వర్గాలను సమీకరించడం కోసం.. రకరకాల ప్రయత్నాలు చేస్తుంది. ముఖ్యంగా పార్టీ వైపు బీసీ వర్గం ఓట్లను మచ్చిక చేసుకోవడంపై ప్రధాన దృష్టి పెట్టింది. హిమాచల్ ప్రదేశ్, కర్ణాటకలో మెజార్టీ వర్గంగా ఉన్న బీసీ వర్గాన్ని తమ వైపు తిప్పుకోవడంలో సక్సెస్ అయింది. తెలంగాణలో కూడా 50 శాతంగా ఉన్న బీసీలను మచ్చిక చేసుకుంటే విజయం సాధించవచ్చని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. అందులో భాగంగా ఇప్పటికే బీసీ వర్గాలకు అనుకూలంగా స్టేట్మెంట్లు ఇస్తున్నారు తెలంగాణ పార్టీ నేతలు. పొలిటికల్ ఎఫైర్స్ కమిటీలో సైతం బీసీలకు ప్రతి పార్లమెంట్ పరిధిలో రెండు అసెంబ్లీ స్థానాలు కేటాయించాలంటూ పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి తీర్మానం చేశారు. అలాగే త్వరలో బీసీ డిక్లరేషన్ కూడా ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. బీసీ డిక్లరేషన్ సన్నాహక సమావేశాల్లో భాగంగా పార్టీ సీనియర్ నేత వి. హనుమంతరావు అన్ని జిల్లాల్లో సమావేశాలు సైతం నిర్వహిస్తున్నారు. పార్టీలోనే టీం బీసీ పేరుతో.. చెరుకు సుధాకర్, కత్తి వెంకటస్వామి వంటి బీసీ నేతలు సైతం సమావేశాలు చర్చలు నిర్వహిస్తూ బీసీ వర్గాలను ఏకతాటి పైకి తెస్తున్నారు. బీసీ డిక్లరేషన్లో ఏ యే అంశాలు ఉండాలనే దానిపై కూడా కసరత్తు చేస్తున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జ్ మాణిక్ రావు థాక్రే.. పార్టీ నేతలతో ఎలాంటి సంప్రదింపులు చేయకుండానే నేరుగా వైసీపీ ఎంపీ ఆర్. కృష్ణయ్య నివాసానికి వెళ్లి భేటీ అయ్యారన్న విషయం పార్టీలో తీవ్ర దుమారం రేపుతుంది. కాంగ్రెస్ పార్టీ జెండా మోస్తూ పార్టీ కోసం పనిచేస్తున్న బీసీ నేతలను కాదని.. ఠాక్రే.. కృష్ణయ్య తో ఎలా భేటీ అవుతారంటూ ప్రశ్నిస్తున్నారని తెలుస్తోంది. థాక్రే తీరు సొంత పార్టీ నేతలను అవమానపరిచేలా ఉందంటూ కీలక నేతలకు చెప్పుకుంటూ ఆవేదన చెందుతున్నారని సమాచారం. పార్టీలో అత్యంత సీనియర్ బీసీ నేతలు చాలా మంది ఉన్నా .. వారితో కనీసం సంప్రదించకుండానే థాక్రే నేరుగా వెళ్లి భేటీ కావడం సమంజసం కాదంటూ మొరపెట్టుకున్నట్లు తెలుస్తోంది. మరో వైపు ఏపీ నేతలు సైతం.. థాక్రే తీరుపై గుర్రుగా ఉన్నారు. ఏపీలో పార్టీని చావు దెబ్బ తీసిన జగన్ పార్టీకి చెందిన వ్యక్తితో.. ఎలా భేటీ అవుతారంటూమండిపడుతున్నారని టాక్ వినిపిస్తోంది.. ఇది చివరకు రాజకీయంగా నష్టం కలిగించేలా ఉన్నాయంటూ లోలోపల రగిలిపోతున్నట్లు సమాచారం. తెలంగాణలో రాజకీయంగా ఏదో మైలేజ్ సాధించాలని చూసిన ఇంచార్జ్ థాక్రే.. చర్యలు బెడిసి కొడుతుండటం ఇప్పుడు టీపీసీసీలో హాట్ టాపిక్ గా మారింది. బీసీ నేతతో డైరెక్టుగా భేటీ కావడం.. ఇటు తెలంగాణ.. అటు ఏపీ నేతలు ఫైర్ అవుతుండటంతో ఈ వ్యవహారం ముందుముందు ఎటువైపుకు దారి తీస్తుందనేది వేచిచూడాల్సిందే..

## డిసెంబర్ మొదటి వారంలో
# ఎన్నికలు..?

(మొదటిపేజీ తరువాయి)

వర్గాలు తెలిపాయి. షెడ్యూలు, పోలింగ్ అంశాలపై క్లారిటీ వచ్చిందని చెప్పుకొచ్చాయి. అందులో భాగంగానే త్వరలో కలెక్టర్లతో సమావేశం నిర్వహించేందుకు సీఈఓ ప్లాన్ చేస్తున్నట్టు టాక్. ఈ వారం చివర్లో సెంట్రల్ ఎలక్షన్ టీం రాష్ట్రంలో పర్యటించే చాన్స్ ఉన్నది. 2018లో తెలంగాణతో పాటు మిజోరం, రాజస్తాన్, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ఈసీ ఒకేసారి షెడ్యూలు విడుదల చేసింది. ఈ సారి సైతం అదే తేదీన ఎలక్షన్స్ నిర్వహించే అవకాశమున్నట్టు టాక్. '2018లో డిసెంబరు 7న తెలంగాణ అసెంబ్లీకి ఓటింగ్ జరిగింది. ఈసారి కూడా డిసెంబర్ 7న ఎలాంటి పండుగలు లేకపోతే అదే రోజు పోలింగ్ ఉండొచ్చు. లేకపోతే రెండు రోజులు అటు ఇటుగా డేట్ ఫిక్స్ కావచ్చు.' అని ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి వెల్లడించారు. మిజోరంలో డిసెంబరు 16 లోపు అసెంబ్లీ ఎన్నిక పూర్తవ్వాలి. అదే టైంలో మన రాష్ట్రానికి సైతం ఎన్నికల పక్రియ పూర్తవుతుందని వివరించారు. ఈ నెల 6వ తేదీ తర్వాత అన్ని జిల్లాల కలెక్టర్లతో హైదరాబాద్‌లో మీటింగ్ నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తున్నట్టు టాక్. ఈ సమావేశానికి కేంద్ర ఎన్నికల సంఘం ఆఫీసర్ల టీమ్ హాజరయ్యే అవకాశం ఉన్నట్టు తెలిసింది. ఆ తర్వాత సెంట్రల్ ఈసీ బృందాలు రాష్ట్రంలో పర్యటించి, ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించనున్నాయి. ఎన్నికల్లో డబ్బు ప్రవాహం లేకుండా అన్ని రాజకీయ పార్టీలు బాధ్యత తీసుకోవాలని ఎథికల్ ఓటింగ్‌పై అవగాహన కల్పించేందుకు ఇప్పటికే ఈసీ.. ఆల్ పార్టీ సమావేశం నిర్వహించింది. ప్రభుత్వ పరంగా తీసుకునే నిర్ణయాలు, వాటి అమలుకు సుమారు 70 రోజులు మాత్రమే గడువు ఉందని అధికార వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఎలక్షన్ షెడ్యూలు వచ్చిన తర్వాత ఎన్నికల కోడ్ మేరకు ఎలాంటి విధాన పరమైన నిర్ణయాలు తీసుకునే చాన్స్ ఉండదు. అందుకే సీఎం కేసీఆర్ పాత హామీల అమలుపై ప్రస్తుతం ఫోకస్ పెట్టినట్టు తెలుస్తున్నది. అందులో భాగంగానే రుణమాఫీని సెప్టెంబర్ రెండోవారం లోపు పూర్తి చేయాలని టార్గెట్ పెట్టినట్టు ప్రచారం జరుగుతున్నది.

## మనీలాండరింగ్ కేసులో
# ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మరోసారి దాడులు

(మొదటిపేజీ తరువాయి)

కరూర్‌లలో మంత్రి సెంథిల్ బినామీదారుల ప్రదేశాల్లో ఈ దాడులు నిర్వహించినట్లు ఈడీ వర్గాలు పేర్కొన్నాయి. మనీలాండరింగ్‌కు సంబంధించి మంత్రి సెంథిల్ బాలాజీ ఇంటితో పాటు కార్యాలయాల్లో జూన్ 14న ఈడీ దాడులు జరిపింది. ఆ తర్వాత ఆయనను అరెస్టు చేయగా.. ప్రస్తుతం ఈడీ కస్టడీలో ఉన్నారు. అయితే, అరెస్టు అయినా సెంథిల్ బాలాజీని ప్రభుత్వం మంత్రి పదవి నుంచి ఇంకా తొలగించలేదు. మరో వైపు బెయిల్ కోసం సెంథిల్ బాలాజీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సర్వోన్నత న్యాయస్థానం ఈడీ స్పందన కోరింది. ఆయన విచారణ కోసం సహకరించడం లేదని, తన పదవిని దుర్వినియోగం చేసి రవాణాశాఖలో ఉద్యోగాల పేరిట కుంభకోణానికి పాల్పడ్డారని ఈడీ ఆరోపించింది. ఇంతకుముందు సెంథిల్ బాలాజీకి బెయిల్ మంజూరు చేసేందుకు మద్రాసు హైకోర్టు నిరాకరించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ బాలాజీ దంపతులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

# కాంగ్రెస్‌లో చేరిన జూపల్లి

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీర్ వేణుగోపాల్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సమక్షంలో మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్ లో చేరారు. అయనతో పాటు , నాగర్ కర్నూల్ నియోజ కవర్గం నుంచి ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి కుమారుడు రాజేష్ రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్ రెడ్డి, కొడంగల్ మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్ రెడ్డి, కొడంగల్ ఎంపీపీ ముద్దప్ప దేశ్ ముఖ్,అన్న కిష్టప్ప, నారాయణ రెడ్డి, వనపర్తి నియోజకవర్గానికి చెందిన ఎంపీపీలు,మేఘారెడ్డి, కిచ్చారెడ్డి, వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ నాగరాజు,తదితరులు కుడా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.

# పథకాలు సరే.. నిధులెలా..!

(మొదటిపేజీ తరువాయి)

రుణాలను మాఫీ చేస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారు. ఇప్పటివరకు రూ.37 వేల లోపు రుణాలను మాఫీచేసింది. మొత్తం 5.42 లక్షల మందికి చెందిన రూ.1,207 కోట్ల రుణాలను మాఫీ చేసింది. మిగిలిన 37 వేల నుంచి 90 వేల లోపు గల రుణాలను 2023–24 ఆర్థిక సంవత్సరంలో మాఫీ చేయాల్సి ఉంది. ఇందు కోసం 19 వేల కోట్లు అవసరం. కానీ బడ్జెట్‌లో కేటాయించింది ఆరు వేల కోట్లు మాత్రమే. అయినా నెలన్నరలో పూర్తి చేయమని కేసీఆర్ఆదేశించారు. తెలంగాణ సీఎం కేసీఆర్ చాలా రోజులుగా ఎన్నికలకు కసరత్తు చేస్తున్నారు. తన పార్టీకి ఎక్కడెక్కడ మైనస్ ఉందో సర్వేల మీద సర్వేలు చేయించుకుని దిద్దుబాటు చర్యలు తీసుకుంటున్నారు .. ఆర్టీసీ ఉద్యోగుల్లో వ్యతిరేకత ఉందని తేలిన తర్వాత.. విలీనం నిర్ణయంతో సరి పెట్టారు. అనూహ్యంగా గ్రేటర్ హైదరాబాద్ ... ముఖ్యంగా శివారు ప్రాంతాల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని నివేదికలు వచ్చిన తర్వాత కేసీఆర్ అందుకు గల కారణాలపై పూర్తి స్థాయిలో విశ్లేషణ జరిపి అందర్నీ కూల్ చేయడానికి మెట్రో ఒక్కటే మార్గమనే నిర్ణయానికి వచ్చినట్లుగా చెబుతున్నారు. అలా దళిత బంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు వంటి పథకాలను ప్రారంభించారు. కాలం రుణమాఫీ చేయకపోవడానికి కేంద్రం కారణం అని ప్రకటించారు కేసీఆర్. అప్పులు తీసుకోకుండా అడ్డుకోవడమే కారణం అన్నారు. మరి ఇప్పుడు కేంద్రం అనుమతించిందా అన్నదే ప్రశ్న. నిధుల సమీకరణ ఎలా అన్నది మిస్టరీగా మారింది. ఇప్పటికే పెద్ద ఎత్తున పథకాలకు నిధులు పెండింగ్‌లో ఉన్నాయన్న ప్రచారం జరుగుతోంది. హైదరాబాద్ మినహా జిల్లాల్లో ఉన్న ఉద్యోగులకు జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉంది. మరి వేల కోట్లు ఎలా సమీకరిస్తారన్నది కీలకంగా మారింది. ఎన్నికల్లో ఓటింగ్ జరిగే నాటికి హామీలన్నీ పూర్తి కాకపోతే.. ప్రజల్లో వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంటుంది.

## సంపాదకీయం

## ఆర్టీసీ విలీనం కార్మికులకు మేలేనా ?

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం హాట్ టాపిక్ గా మారింది. ఇప్పటికే ఏపీలో ఆర్టీసీ ఉద్యోగుల్ని విలీనం చేశారు. దీంతో అక్కడ ఉద్యోగులకు మేలు జరిగిందా లేదా అన్న చర్చ ప్రారంభమయింది. మరి ఏపీలో ఉద్యోగులకు మేలు జరిగిందా ? విలీనం వల్ల తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు మేలు జరుగుతుందా ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ విలీనం తరువాత ఎలా ఉంది..కార్మికులు ఫుల్ ఖుషీనా.. శాలరీలు ఎలా ఉన్నాయి.. ఈ విషయాలను గురించి కార్మికులను ప్రశ్నిస్తే దిమ్మ తిరిగే విషయాలు చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థలో విలీనంత తరువాత పరిస్థితులు పై కార్మికుల నుండి షాకింగ్ రియాక్షన్స్ వస్తున్నాయి. సీనియర్లను కాదని, జూనియర్లకు శాలరీల పెంపుదల చేయటం పై వారు మండిపడుతున్నారు. అదేం లెక్కంటే అధికారులు నోరు మెదపటం లేదని గుర్రుగా ఉన్నారు. విలీనం అయిన సంతోషం లేదంటున కార్మికుల వర్గాలు. కార్పొరేషన్ నుంచి ప్రభుత్వంలో విలీనం అయిన తర్వాత తాము మరింతగా వెనుకబడిపోయామని ఏపీ ఆర్టీసీ ఉద్యోగులు చెబుతున్నారు. రాష్ట్ర విభజన తరువాత ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న డిమాండ్ ఆంధ్రప్రదేశ్ లో ఉంది. అయితే గత తెలుగు దేశం ప్రభుత్వం హామీ ఇచ్చి కూడ అమలు చేయకపోవటంతో అదే హామిని అమలు చేస్తానని అధికారంలోకి వచ్చిన వైసీపీ అన్నట్లుగానే ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల్ని విలీనం చేసింది. దీంతో ఈ ప్రభావం అటు తెలంగాణా పై కూడా పడింది. ఆర్టీసీ లో విలీనం సాధ్యం కాదని గతంలో ప్రకటన చేసిన తెలంగాణా సీఎం కేసీఆర్, కార్మికుల డిమాండ్ మేరకు తెలంగాణా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారు. ప్రభుత్వంలో విలీనం తరువాత మీరు ఎలా ఉన్నారంటూ ఏబీపీ దేశం పలకరించిందే తడవు... కార్మికుల తమ సమస్యలను ఎకరవు పెట్టారు. చివరకు వైసీపీ అనుబంధంగా ఉన్న కార్మిక సంఘాలు సైతం తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ లో విలీనం తరువాత తమ పరిస్దితి వెనుకబడినట్లుగా అయ్యిందని మిగిలిని కార్మికులు అంటున్నారు. సీనియారిటి, జూనియర్ అనే అంశాలను పక్కన పెట్టి నిన్న కాక మెన్న ఉద్యోగంలో చేరిన వారికి పది వేల రూపాయలకు పైగా జీతాలు పెంచారని, తమకు మాత్రం కేవలం 3వేల రూపాయలు పెంచారని అంటున్నారు. అదేమంటే, అదికారులు స్పందించటం లేదని చెబుతున్నారు.అంతే కాదు ప్రభుత్వం లో విలీనం అయిన సంతోషం కార్మికుల్లో లేదని, ప్రదానంగా వైద్య సదుపాయం లేకుండాపోవటంతో పరిస్దితి ఆగమ్యగోచరంగా మారిందని అంటున్నారు. కార్పొరేషన్ లో ఉండగా ప్రైవేట్ ఆసుపత్రికి వెళితే ఎంత ఖర్చు అయినా భరించే వారని, అయితే ప్రభుత్వంలో విలీనం అయిన తరువాత, ప్రైవేట్ ఆసుపత్రులు ఈహెచ్ఎస్ పై సదుపాయాలు ఇవ్వలేమని చేతులు ఎత్తేస్తున్నాయని అంటున్నారు. దీని వలన కార్మికులు అనారోగ్యం బారినపడి .. సర్వం పోగొట్టుకుంటున్నారని అంటున్నారు. తెలంగాణా రాష్ట్రంలో ఆర్టీసీ ని ప్రభుత్వంలో విలీనం చేసిన తరువాత అక్కడ కార్మికులు సంబరాలు చేసుకుంటున్న నేపద్యంలో ఆంధ్రప్రదేశ్ లో విలీనం తరువాత కార్మికుల అవస్దలు చెప్పుకోవటం విశేషం.. అధికారులకు ప్రభుత్వం నుండి సరైన ఆదేశాలు ఇచ్చి, పర్యవేక్షణ చేస్తే పరిస్దితుల్లో మార్పులు వస్తాయని కార్మికుల ఆశిస్తున్నారు. మరో వైపు ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడం ఎన్నికల స్టంటా? అని విలేకరులు ప్రశ్నించగా, “ఎన్నికల స్టంట్ అనుకో.. ఏదైనా అనుకోండి.. మాది రాజకీయ పార్టీ.. అని మంత్రి వ్యాఖ్యానించారు. “మాది రాజకీయ పార్టీ వయా.. ఎన్నికలనుకో ఏదన్నా అనుకో.. కార్మికులైతే న్యాయం జరిగిందా లేదా? వాళ్ల భవిష్యత్తు మంచిగా అయిందా లేదా? ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చినయా లేదా? ఎన్నికలకు ఎట్లనన్నా పోతం, ఎన్నికల స్టంట్ ఉంటది. ఇది రాజకీయ పార్టీ. కానీ, చేసే దిల్, ధైర్యం కావాల. ఎంత ఫండ్స్ కావాలె. ఎంత ధైర్యం కావాల. అది మా కేసీఆర్ కే ఉంది” అని మాట్లాడారు. అటు ప్రతిపక్షాలు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని స్టేట్ కేబినెట్?లో తీసుకున్న నిర్ణయం.. ఆ సంస్థ కార్మికులపై ప్రేమతో కాదని బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్నారు. ఈ నిర్ణయం వెనుక కుట్ర దాగి ఉందని తెలిపారు. ఆర్టీసీకి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విలువైన ఆస్తులు అమ్ముకునేందుకే అని ఫైర్ అయ్యారు.

## రైతుల పక్షపాతి సీఎం కేసీఆర్: మోత్కుపల్లి



**యాదాద్రి భువనగిరి -ప్రభాతసూర్యుడు:** సీఎం కేసీఆర్ రైతుల పక్షపాతి. రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ చేసి రైతన్నల సంక్షేమానికి పెద్దపీట వేసినందుకు రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలుపుతున్నామని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింలు అన్నారు. గురువారం ఆలేరు పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం గర్వించేలా సీఎం కేసీఆర్ పథకాలు కొనసాగు తున్నాయన్నారు. 24 గంటల ఉచిత కరెంటు, రైతుబంధు రైతు బీమా, ఇస్తున్న ఘనత సీఎం కేసీఆర్ దక్కుతుందని ప్రశంసించారు, రైతులకు రుణమాఫీ చేయడం చాలా సంతోషమని, అప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో రుణాలు కట్టలేక రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. ఇప్పుడు సీఎం కేసీఆర్ హయాంలో రైతులు మూడు పంటలు పండించుకుని సంతోషంగా ఉంటున్నారని పేర్కొన్నారు. జనరంజక పాలన అందిస్తున్న సీఎం కేసీఆర్ వచ్చే ఎన్నికల్లో మరోసారి విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

## మొరంచపల్లి వదర బాధితుల ధర్నా

**భూపాలపల్లి --ప్రభాతసూర్యుడు:**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొరంచపల్లి లో వరద భాదితులు ఆందోళన కు దిగారు. జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో చేసారు. వరద బాధితులకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం వెంటనే అందించాలని డిమాండ్ చేసారు. దాంతో వాహనాలు ఇరువైపుల భారీగా నిలిచిపోయాయి. వరద బాధితులు, ఆందోళనకారులకు పోలీసులు నచ్చచెప్పి సముదాయించారు.

### సైబర్ నేరాల,భద్రత పై

# ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలి

**- జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్**

**- ప్రతి నెల మొదటి బుధవారం సైబర్ జాగృక్త దివాస్**

**జగిత్యాల - ప్రభాత సూర్యుడు :** సైబర్ నేరాల,భద్రత పై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్ఆన్నారు..సైబర్ నేరాలు పై అవగాహన గురించి ప్రతి నెల మొదటి బుధవారం రోజున సైబర్ జాగృక్త దివాస్ అనే ప్రత్యేక కార్యక్రమం జిల్లా లోని అన్ని పోలీస్ స్టేషన్లో పరిధిలో వివిధ పాఠశాలల్లో ఉన్న విద్యార్థులకు, యువతకు, ప్రజలకు సైబర్ భద్రత , సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని ఎస్పీ తెలిపారు..సైబర్ నేరాలపై అవగాహన కల్పించి , సైబర్ నేరాలను నివారించడమే జిల్లా పోలీసుల లక్ష్యం అని జిల్లా ఎస్పీ అన్నారు. అందులో బాగంగా విద్యార్థులకు, యువతకు, ప్రజలకు సైబర్ క్రైంపై అవగాహన కల్పించడంలో భాగంగా తెలంగాణ పోలీస్ ఆధ్వర్యంలో సైబర్ జాగృక్త దివస్ అనే కార్యక్రమం ద్వారా సైబర్ భద్రత తో పాటు సైబర్ నేరాలపై అవగాహన, నివారణకు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ప్రస్తుత కాలంలో వాట్సఅప్, ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ను పిల్లలు ఎక్కువ వాడుతున్నారని, వాటిని వాడేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తల్లిదండ్రులు పిల్లలకు సూచించాలని ఎస్పీ అన్నారు.ఈ కార్యక్రమంలో నేర్చుకున్న విషయాల్ని ప్రతి ఒక్కరు మిగతా వారికి అవగాహన కల్పించాల్సి ఉంటుందని అన్నారు . ఉపాధ్యాయులు సైతం సైబర్ నేరాల నియంత్రణలో తమవంతు పాత్ర పోషించాల్సి ఉంటుంది. ఆన్లైన్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో అందరికీ అవగాహన తప్పనిసరి ఎస్పీ అన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణకు జిల్లా పోలీసులు ప్రత్యేక చర్యలు

**జగిత్యాల టౌన్ ఇన్స్పెక్టర్ నటేష్**

**జగిత్యాల - ప్రభాత సూర్యుడు :** శాంతి భద్రతల పరిరక్షణకు జిల్లా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు జగిత్యాల టౌన్ ఇన్స్పెక్టర్ నటేష్ ఆన్నారు..జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్ ఆదేశాల మేరకు అర్ధరాత్రి రోడ్లపై అనవసరంగా తిరుగుతున్న వారే లక్ష్యంగా ‘ఆపరేషన్ నైట్ సేఫ్టీ’ పేరుతో జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి లో పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా అర్ధరాత్రి వేళల్లో ప్రధాన కూడళ్లు, వీధులు, రోడ్లు, వాహనాలతో జులాయిగా తిరుగుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ, మద్యం సేవించి రోడ్లపై ద్విచక్ర వాహనాలతో రాష్ డ్రైవింగ్, హారన్లు కొడుతూ, ప్రధాన కూడళ్ల లలో వాహనాలను నిలిపి గుంపులుగా అనుమాన స్పదంగా తిరుగుతున్న 20 మంది యువకులను అదుపులోకి తీసుకోని, వారి 8 బైక్ లను,1 కారును పోలీసులు సీజ్ చేశారు..ఈ సందర్భంగా టౌన్ ఇన్స్పెక్టర్ నటేష్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా,అసాంఘిక కార్యకలాపాలను నివారణ లక్ష్యంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆపరేషన్ నైట్ సేఫ్టీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని సీఐ తెలిపారు. ముఖ్యంగా అర్ధరాత్రిలో మద్యం సేవించి అనవసరంగా రోడ్లపైకి వచ్చి ప్రజలను ఇబ్బంది గురి చేస్తే పోలీస్ శాఖ కేసు నమోదు చేయడం జరిగిందిని తెలిపారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు అలవాటు పడే అవకాశం ఉన్నదని, తల్లిదండ్రులు పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇకనుండి జిల్లాలో తరచుగా స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించడం జరుగుతుందని అర్ధరాత్రి ఎవరైనా యువకులు రోడ్లపై అనవసరంగా గుంపులుగా సంచరిస్తూ సామాన్య ప్రజానీకానికి, మహిళలను ఇబ్బందులకు, అభద్రత భావానికి గురి చేస్తే వారిపై టౌన్ న్యూసెన్స్ ఆక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు.యువత చట్టవ్యతిరేకమైన పనుల్లో పాల్గొంటే వారి యొక్క మంచి భవిష్యత్ ను కోల్పోతారని ఎస్పీ సూచించారు.

# సిట్టింగ్‌లకు.. ఫిట్టింగ్‌లు

(మొదటిపేజీ తరువాయి)

వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలు కూడా టికెట్లు ఆశిస్తుండటంతో... పలు నియోజకవర్గాల్లో గట్టి పోటీ నెలకొంది. ఇదే జాబితాలోకి వస్తోంది యాదాద్రి జిల్లాలోని ఆలేరు నియోజకవర్గం. వచ్చే ఎన్నికల్లో ఇక్కడ్నుంచి బీఆర్ఎస్ తరపున ఎవరు పోటీ చేస్తారనేది టాక్ ఆఫ్ ది ఆలేరుగా మారింది.రాష్ట్ర ఏర్పాటు కంటే ముందు ఆలేరులో కాంగ్రెస్ హవా నడిచేది. ఇక్కడ్నుంచి 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బూడిద భిక్షమయ్య గౌడ్ గెలిచారు. కానీ తెలంగాణ ఏర్పాటు తర్వాత జరిగిన 2014 ఎన్నికల్లో ఇక్కడ గులాబీ జెండా ఎగిరింది. గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి చేతిలో భిక్షమయ్య గౌడ్ ఓటమి చవిచూశారు. 2018 ఎన్నికల్లోనూ గొండిడి సునీతా మరోసారి విజయాన్ని అందుకున్నారు. ఈ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన భిక్షమయ్య గౌడ్ ఓటమి పాలయ్యారు. 33వేల ఓట్లకు పై మెజార్టీతో గులాబీ జెండా రెపరెపలాడింది. ఆ తర్వాత నియోజకవర్గంలో పరిణామాలు వేగంగా మారిపోయాయి. కాంగ్రెస్ కేడర్ బీఆర్ఎస్ లోకి జంప్ అయింది. ఈ క్రమంలోనే... భిక్షమయ్య గౌడ్ కూడా కారెక్కారు. దీంతో గొంగిడి, భిక్షమయ్య గౌడ్ వర్గం అన్నట్లు తయ్యారైంది. కట్ చేస్తే... ఇంతలోనే కారు పార్టీకి షాక్ ఇస్తూ కమలం గూటికి చేరారు భిక్షమయ్య గౌడ్. అక్కడ ఎక్కువ కాలంపాటు ఉండలేకపోయారు. మునుగోడు బైపోల్ సందర్భంగా... మళ్లీ గులాబీ శిబిరంలోకి వచ్చేశారు. ప్రస్తుతం పార్టీలో యాక్టివ్ గా తిరుగుతున్నారు. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ... వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు రెడీ అన్న సంకేతం ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు.భిక్షమయ్య గౌడ్ కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తారనే చర్చ గట్టిగా వినిపిస్తోంది. కానీ అలా జరగలేదు. అయితే ఆయనకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చే అవకాశం ఉందన్న వార్తలు కూడా ఓ వైపు నుంచి తెరపైకి వస్తున్నాయి. ఆ కారణంతోనే ఆయనకు ఎమ్మెల్సీ ఇవ్వలేదన్న అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. మరోవైపు మరికొద్దిరోజుల్లోనే అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ.... మరోసారి పార్టీ టికెట్ పై పోటీ చేసి హ్యాట్రిక్ విజయాన్ని అందుకోవాలని సిట్టింగ్ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి భావిస్తున్నారు. ఈసారి కూడా తనకే టికెట్ వస్తుందని గట్టిగా విశ్వసిస్తున్నారు.తాజా పరిస్థితుల నేపథ్యంలో.... బీఆర్ఎస్ అధినాయకత్వం సిట్టింగ్ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డికే మరోసారి ఛాన్స్ ఇస్తుందా...? లేక భిక్షమయ్య గౌడ్ వైపు చూస్తుందా అనేది ఆసక్తికరంగా మారింది. కట్ చేస్తే వీరిద్దరి పేర్లే కాకుండా... కొత్తగా పైళ్ల శేఖర్ రెడ్డి పేరు కూడా తెరపైకి వస్తోంది. భువనగిరి టికెట్ ను కుంభం అనిల్ కుమార్ రెడ్డికి ఇచ్చి... ఆలేరు శేఖర్ రెడ్డికి ఇస్తారనే టాక్ కూడా మొదలైంది. వీరే కాకుండా... మాజీ మంత్రి మోత్కుపల్లి కూడా పోటీకి రెడీ అంటున్నారు. మొత్తంగా ఆలేరు సీటు నుంచి ఎవరు పోటీ చేస్తారనేది మాత్రం బీఆర్ఎస్ లోనే కాదు ప్రత్యర్థి శిబిరంలోనూ ఆసక్తిని రేపుతోంది.

## బీజేపీలో చేరికలు

**యాదాద్రి – ప్రభాతసూర్యుడు:** యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు గూడూరు నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ చేరికల కమిటీ చైర్మన్ ఈటెల రాజేందర్ సమక్షంలో పోచంపల్లి కి చెందిన దాదాపు వంద మందికి పైగా ముఖ్య నాయకులు అంతా కమలం పార్టీలోకి చేరారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఉన్న గూడూరు నారాయణ రెడ్డి నాయకత్వములో.. పోచంపల్లి పట్టణములోని వివిధ పార్టీలకు చెందిన 100 మంది ముదిరాజ్ సంఘం నాయకులకు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటెల రాజేందర్ బిజెపి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వములో.. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ.. దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్న మోడీ నాయకత్వములో పనిచేయాలని పిలుపునిచ్చారు. భువనగిరి నియోజకవర్గంలోని పోచంపల్లి నుంచి బిజెపి పార్టీ లో చేరినవారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ.. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్త బిజెపి పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ రాబోయే ఎన్నికల్లో భువనగిరి గడ్డపై కాషాయ జెండా ఎగురవెయ్యాలని ఈటల రాజేందర్ అన్నారు.

## మంత్రి మల్లారెడ్డి పనితీరుపై

### డిసిసి అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ మండిపాటు

**మేడ్చల్ – ప్రభాతసూర్యుడు:**

ఒకవైపు రాష్ట్రం కోట్ల రూపాయల నిధులతో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నామంటూ తెలుపుతుండగా ఇదే విషయాన్ని మంత్రి మల్లారెడ్డి డప్పు కొట్టి చెపుతూ ఇప్పుడు సొంత నిధులు కేటాయిస్తూ రోడ్లు నిర్మిస్తున్నామంటూ చెప్పడం ఏంటని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నంది కంటి శ్రీధర్ అన్నారు. షామీర్పేట్ మండలం తో పాటు జిల్లాలోని ఇతర మండలాలకు మంత్రి కుమారుడు మహేందర్ రెడ్డి శంకుస్థాపనలు చేయడాన్ని ఇప్పటికే పలువురు నేతలు ప్రశ్నిస్తుండగా అవి ట్రస్టు నిధులు సొంత నిధులు అంటూ తెలుపుతూ పనులు పెను వెంటనే చేపట్టడం పై ఆయన తీవ్రంగా స్పందించారు. ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రి బాధ్యతలు చేపట్టిన అప్పట్నుంచి కానరాని గ్రామాలలోని స్థితిగతులు ఎన్నికల ముందు ఇంటింటికి వెళ్తే అడుగడుగునా అడ్డుకోవడాలు, ఆందోళనలు తట్టుకోలేక, మళ్లీ ఓట్ల కోసం వెళ్తే ప్రజలు గల్ల పట్టుకొని అడుగుతారననే ఒకే ఒక్క కారణంతోటి రోడ్లు వేస్తున్నారని ఆరోపించారు.మేడ్చల్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా మంత్రిగా ఇప్పటివరకు ఎన్ని నిధులు తో అభివృద్ధి పనులు చేపట్టారు శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.మాటల్లో వేల కోట్లు దాటుతుండగా మరి గ్రామాలలో కనీసం రోడ్లు లేకపోవడం ఏంటని మౌలిక సదుపాయాలు సైతం ట్రస్టుల ద్వారా సొంత నిధులతో చేపట్టడంలో ఆంతర్యమేందని ప్రశ్నించారు.ఏమైనా ప్రజా ఉపయోగం కోసం చేస్తున్న ఈ పనులు స్వాగతిస్తూనే ప్రజాప్రతినిధిగా మల్లారెడ్డి ఫెయిల్ అయ్యారని ఆరోపించారు

## హోమ్ గార్డులకు ఉద్యోగ భద్రత కల్పించండి

**- మంత్రి ఈశ్వర్ ను కోరిన హోమ్ గార్డులు**

**జగిత్యాల - ప్రభాత సూర్యుడు :**

తెలంగాణ రాష్ట్రంలో హోమ్ గార్డులు చాలి చాలని జీతాలతో ఉద్యోగ భద్రత కరువై ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ హోమ్ గార్డ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు సత్తయ్య కోరారు. గురువారం ఉదయం మంత్రి కొప్పుల ఈశ్వర్ ను సత్తయ్య ఆధ్వర్యంలో హోమ్ గార్డ్స్ కలిసి వినతి పత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం హోం గార్డ్స్ ఉద్యోగాలను పర్మినెంట్ చేస్తామని ముఖ్యమంత్రి చెప్పారన్నారు. అలాగే భక్త రామదాసు ప్రాజెక్టు, అసెంబ్లీ లో, బీఆర్ ఎస్ భవన నిర్మాణ సమయాల్లో, పోలీసు శాఖ అధికారులతో నిర్వహించిన సమయాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ పర్మినెంట్ విషయాన్ని మాట్లాడారన్నారు. రెగ్యులర్ పోలీసులతో సమానంగా ప్రజా రక్షణ కోసం పాటుపడుతున్న మా శ్రమను గుర్తించి ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో ఉద్యోగ భద్రతపై ఒక ప్రకటన వచ్చేలా ప్రభ్యత్వం దృష్టికి తీసుకొని వెళ్లాలని తెలంగాణ హోమ్ గార్డ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు సత్తయ్య కోరారు. ఆయన వెంట హోమ్ గార్డులు లక్ష్మీ నారాయణ తోపాటు పలువురు ఉన్నారు.

### అందం కోసం

## మహిళ చేసిన ప్రయత్నం ఫెయిల్

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :**

తనని మోడల్ గా చూడాలనుకున్న భర్త కోరికను తీర్చడానికి ప్రయత్నం చేసిన ఓ మహిళాకు తీరని నష్టం వాటిల్లింది. ఆమె ప్రయత్నం బెడిసి కొట్టింది. బాధితురాలి పొడుగ్గా ఉన్న హెయిర్ ని బ్యూటీషియన్ కట్ చేసి హెయిర్ ఆయిల్ పెట్టింది. బ్యూటీషియన్ పెట్టిన హెయిర్ ఆయిల్ తో మొత్తం జుట్టంతా ఊడిపోయింది. వున్నహెయిర్ రాలిపోవడంతో కంగుతిని మహజల ఇంటికి పరుగులు తీసింది. భార్య హెయిర్ పోవడం చూసి భర్త షాక్ కు గురైయాడు. అందంగా కనిపించాలనుకున్న భార్యకు ఉన్న వెంట్రుకలు కూడా పోవడంతో ఇద్దరి మధ్య గొడవ చెలరేగింది. ఊడిపోతున్న వెంట్రుకలని పట్టుకుని పోలీస్ స్టేషన్ కు వెళ్లిన బాధిత మహిళచ అక్కడ బ్యూటీ పార్లర్ నిర్వాహకులపై పిర్యాదు చేసింది. అబిడ్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



కుత్బుల్లాపూర్ - ప్రభాతసూర్యుడు: కుత్బుల్లాపూర్ నియోజ కవర్గం, చింతల్ ఎమ్మెల్యే కార్యాలయం వద్ద రైతు రుణ మాఫీ పునఃప్రారం భించినందుకు గాను బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి వర్యులు కేటీఆర్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే కె.పి.వివేకానంద సూచ నలతో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు గౌరవ ముఖ్య మంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలా భిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు,సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్లాపూర్ మెట్ తాహసీల్దారుగా వై.అశోక్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ



అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు : అబ్దుల్లాపూర్ మెట్ తాహసిల్దార్ గా వై.అశోక్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తాహసిల్దారుగా విధులు నిర్వహించిన అనితా రెడ్డి హైదరాబాద్ జిల్లాకు బదిలీ కాగా, ఆమె స్థానంలో యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల తాహసిల్దారుగా విధులు నిర్వహించిన అశోక్ రెడ్డి అబ్దుల్లాపూర్ మెట్ మండల తాహసిల్దారుగా విధులు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబ్దుల్లాపూర్ మెట్ మండల రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

## సీనియర్ సిటీజన్స్ ఎన్నికలు ఏకగ్రీవం

జగిత్యాల - ప్రభాత సూర్యుడు : తెలంగాణ అల్ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ జగిత్యాల పట్టణ కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి.గురువారం జగిత్యాల పట్టణంలోని అరవింద్ నగర్‌లో రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శిగౌరిశెట్టి విశ్వనాథం ల పర్యవేక్షణలో ఎన్నికల అధికారి బొల్లం విజయ్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. జగిత్యాల పట్టణ శాఖ అధ్యక్షుడుగా సీనియర్ న్యాయవాది పోతంశెట్టి సతీష్ రాజు, కార్యదర్శిగా మానాల కిషన్, కోశాధికారి గా నారాయణ,, ఉపాధ్యక్షులుగా సయ్యద్ యూసుఫ్, పి.మనోహర్ రావు,సంయుక్త కార్యదర్శులుగా ఎం.డి.ఎక్బాల్, నారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా వెంకట్ రెడ్డి,, శంకర్, కార్యవర్గ సభ్యులుగా కొండాపూర్ యాకూబ్, ఏ.గంగారాం, రాం చంద్రం, విజయ లక్ష్మి లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికయిన కార్యవర్గ ప్రతినిధులను మాజీ మున్సిపల్ చైర్మన్ జీ ఆర్ దేశాయ్, మున్సిపల్ కౌన్సిలర్స్ ఫోరం అధ్యక్షుడు పంబాల రాం కుమార్, మున్సిపల్ కౌన్సిలర్ కూసరి అనిల్ కుమార్, టీ బీసీ రాష్ట్ర కార్యదర్శి బండారి విజయ్, సీనియర్ సిటీజన్స్ కోరుట్ల డివిజన్ అధ్యక్షుడు పబ్బా శివానందం,మెట్ పల్లి డివిజన్ అధ్యక్షుడు ఒజ్జల బుచ్చిరెడ్డి,తదితరులు ఘనంగా సన్మానించారు.

## దివంగత కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్నకు అసెంబ్లీ ఘన నివాళి



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు : తెలంగాణ అసెంబ్లీ సమా వేశాలు ప్రారం భమ య్యాయి. సభ ప్రార ంభమైన అనంతరం అసెంబ్లీ దివంగత కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్నకు నివాళు లర్పించింది. అనంతరం సభలో సీఎం కేసీఆర్ సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాలుగు దశాబ్దాల పాటు రాజకీయాల్లో శాసన సభ్యుడిగా, ఇతర అనేక హోదాల్లో పని చేశారన్నారు. ఆయన వ్యక్తిగతంగా మంచి అనుబంధం ఉందన్నారు.ఎటువంటి సందర్భంలోనైనా చిరునవ్వుతో చాలా ఓపికతో ఉండేవారని, అందరితో కలుపుగోలుగా ఉండేవారని సీఎం కేసీఆర్ గుర్తు చేసుకున్నారన్నారు. సాయన్న కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తాను ముఖ్యమంత్రిని అయ్యాక.. అనేక సందర్భాల్లో ఏదైనా ప్రయత్నం చేసి హైదరాబాద్ జీహెచ్ఎంసీలో కంటోన్మెంట్‌ను కలిపేందుకు ఎనలేని కృషి చేశారన్నారు. కంటోన్మెంట్ ప్రజలకు చాలా తపనపడేవారన్నారు. అనేక సందర్భాల్లో తీర్మానాలు చేసి కేంద్రానికి పంపాం.ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేసి కంటోన్మెంట్లను నగరపాలికల్లో కలపాలని ఆలోచిస్తుందన్న శుభవార్త అందింది. ఆ రకంగానైనా సాయన్న కోరిక నెరవేరాలని కోరుకుం టున్నానన్నారు. సాయన్న నిజామాబాద్ జిల్లాలో జన్మించారని, హైదరాబాద్ జీహెచ్ఎంసీలో సెటిలై.. వ్యాపారవేత్తగా ఉన్నారన్నారు. ఆయన వివాదరహిత నేతల్లో ఆయన ఒకరని, ఆయన కూతురు సైతం నగరంలో కార్పొరేటర్‌గా సేవలందించిందన్నారు. సాయన్న కుటుంబం తమ కుటుంబంలాంటిదన్నారు. ఆయన లేని లోటు తీరనిదని, కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

# అభివృద్ధే లక్ష్యంగా ప్రగతి యాత్ర

### - ఎమ్మెల్యే కె.పి. వివేకానంద



అబ్దుల్లాపూర్ మెట్ మండల తాహసిల్దార్ బాధ్యతలు స్వీకరిస్తున్న అశోక్ రెడ్డి

కుత్బుల్లాపూర్ ప్రభాతసూర్యుడు : ప్రజా ప్రగతి యాత్రలో భాగంగా గురువారం రోజున కుత్బుల్లాపూర్ సమీపంలో సూరారం 129 డివిజన్ పరిధిలోని కళావతినగర్ మరియు టిఎస్ఐఐసి కాలనీలో ఎమ్మెల్యే పాదయాత్ర నిర్వహించడం జరిగింది . 95వ రోజు ప్రగతి యాత్రలో భాగంగా ఎమ్మెల్యే కె.పి.వివేకానంద పర్యటించి 84.10 లక్షల రూపాయలు వ్యయంతో నిర్మించనున్న సీ.సీ. రోడ్డు పనులకు శంకుస్థాపన చేసారు .అనంతరం టిఎస్ఐఐసి కాలనీ శ్రీ వెంకటేశ్వరా స్వామి టెంపుల్ కమాన్ నిర్మాణాకి శంకుస్థాపన చేసారు .అదేవిదంగా ఎమ్మెల్యే సొంత నిధులతో బోరు ఏర్పాటు చేసి నల్లా కనెక్షన్ ని ప్రారంభించారు. తమ కాలనీలో కోట్ల రూపాయలు వెచ్చించి మెరుగైన వసతుల కల్పనకు కృషి చేసినందుకు గాను ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తపరుస్తూ ఎమ్మెల్యే ఘన స్వాగతం పలికారు, ఈ సందర్బంగా ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడుతూ గడిచిన 9 ఏళ్లలో కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులను డివిషన్లలో చేపడుతున్నట్లు, ప్రజా క్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. సౌకర్యవంతమైన రహదారులు, త్రాగునీరు, మెరుగైన విద్యుత్, డ్రైనేజీలు వంటి మౌలిక వసతులతో ప్రతి డివిజన్ ను ఆదర్శ వంతంగా తీర్చిదిదు తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు హెచ్ యమ్ డబ్లూ యస్, జీయమ్ శ్రీధర్ రెడ్డి, డీఈఈ శిరీష, ఏ ఈ సంపత్, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, జనరల్ సెక్రెటారీ సిద్దిక్, సీనియర్ నాయకులు చెక్క సురేష్ బాబు, గిరిధర్, మధు మోహన్, రెహ్మాన్ వినీత్ మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# అల్బెండజోల్ మాత్రలు తప్పకుండా వేయాలి

### జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి పుప్పాల శ్రీధర్



జగిత్యాల - ప్రభాత సూర్యుడు : జిల్లాలోని 1-19 సంవత్సరాల లోపు పిల్లలు ప్రతి ఒక్కరు ఆల్బెండజోల్ మాత్రలు తప్పకుండా వేయించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి పుప్పాల శ్రీధర్ అన్నారు. గురువారం జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని, జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్సియల్ పాఠశాల, పురానీపేట్ లో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. పుప్పాల. శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ, జిల్లాలోని 1-19 సంవత్సరాల లోపు పిల్లలు 2,50,152 వున్నట్లు అంచనా, వీరందరికీ, అల్బె ండజోల్ మాత్రలు తప్పకుండా అంద జేయాలన్నారు. పిల్లల్లో నులి పురుగుల వల్ల పోషక ఆహార లోపం, రక్తహీనత, శారీరక, మానసిక అభివృద్ధి సరిగా ఉండదు, ఆరోగ్య సమస్యల వల్ల పాఠ శాలకు గైరాజరు కావడం వంటి అనేక సమస్యలు ఉత్పన్నం అవుతాయిన్నారు. ఈ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, స్వచ్చంద సేవాసంస్థలు, మహిళా సంఘ సభ్యులు, ఉపాద్యాయులు, అంగన్వాడి టీచర్స్, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, ప్రతి ఒక్కరు భాగస్వామ్యం తీసుకొని, తల్లిదండ్రులలో, పిల్లల్లో అవగాహణ కల్పించి జిల్లాలోని అర్హులైన పిల్లలందరికి అల్బెండజోల్ మాత్రలు వేయించాలని కోరారు. ఎవరైనా ఈ రోజు మాత్రలు వేసుకోలేని పిల్లలకు ఈ నెల 10వ తేది న "మాప్ అప్ డే " రోజు , తప్పకుండా వేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డా. స్వాతి లక్ష్మణ్, డా. ఆనిల్, డా. అనిత, అసిస్టెంట్ మలేరియా అధికారి ఎ. సత్యనారయణ, వంశీ కృష్ణ పాల్గొన్నారు.

## నులి పురుగుల నుండి రక్షణ పొందాలి

### - జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లి - ప్రభాత సూర్యుడు: నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకొని గురువారం రంగంపల్లిలోని మైనారిటీ బాలికల గురుకులంలో నిర్వహించిన నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పెద్దపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ మమతా రెడ్డితో కలిసి పాల్గొని మందుల ను వేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 1 నుండి 19 సంవత్సరా ల వయస్సు ఉన్న 2,19, 500 మంది పిల్లలకు నులిపురుగుల నివారణ మందులు అందించేం దుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. పిల్లలందరూ ఆల్బెండజోల్ మాత్రలు తీసుకొని నులిపురుగుల బారి నుండి రక్షణ పొంది ఎనిమియా తదితర జబ్బులు రాకుండా మానసిక, శారీరకంగా ఆరొగ్యంగా ఉంటూ అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని అన్నారు. వ్యక్తిగత పారిశు ద్యం పట్ల జాగ్రత్త వహించాలని, అంటు వ్యాధులను నివారిస్తు భవితవ్యానికి నాంది పలకాలని కోరారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరొగ్య, అంగన్ వాడి కేంద్రాలలో, ప్రభుత్వ , ప్రభుత్వేతర పాఠశాలలో, జూనియర్ కళాశాలలో, సాంకేతిక కళాశాలలో మందులను ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. నేడు నులిపురుగుల నివారణ మాత్రలు తీసుకోని విద్యార్థులకు ఈ నెల 10న మరోమారు పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. నులిపురుగుల నివారణ మందులు తీసుకోవడంతో పాటు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని, వ్యక్తిగత పరిశు భ్రత పాటించాలని, మనం మన పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ దాసరి మమత విద్యార్థినులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. ప్రమోద్ కుమార్, రాఘవపూర్ మెడికల్ అధికారిని లావణ్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పీఎస్ ఎదుట బీజేపీ నేతల నిరసన

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు : మలక్ పేట పీఎస్ ముందు పెట్రోల్ పోసుకొని దళిత యువకుడు విజయ్ ఆత్మహత్య యత్నానికి పాల్పడిన ఘటన పై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని బిజెపి నేతలు డిమాండ్ చేశారు. తన భార్యను వేధిస్తున్న మజ్లీస్ పార్టీ కార్యకర్తపై ఫిర్యాదు చేసినా మలక్ పేట పోలీసులు చర్యలు తీసుకోలేదని మనస్తాపంతో విజయ్ ఆత్మహత్య యత్నానీ చేశారని ఆరోపించారు. పోలీసుల నిర్లక్ష్యం కారణంగానే ఘటన జరిగిందని విమర్శించారు. సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## వరదలపై ప్రతిపక్ష పార్టీలు బురద రాజకీయం చేస్తున్నాయి

### - వ్యవసాయ శాఖా మంత్రి ప్రశాంత్‌రెడ్డి



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు : వరదలపై ప్రతిపక్ష పార్టీలు బురద రాజకీయం చేస్తున్నాయని మంత్రి ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. అసెంబ్లీ సమావేశాలు గురువారం ప్రారంభమైన విషయం తెలిసిందే. మండలిలో వర్షాలు, వరదలపై స్వల్పకాలిక చర్చ జరిగింది. ఇందులో మంత్రి వేముల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూలేని విధంగా భారీ వర్షాలు కురిశాయన్నారు. ప్రకృతి వైపరీత్యాలను ముందే ఊహించలేమని, ఆపలేమన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు ఫోర్స్‌గా నిలబడ్డారన్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాలతో ఎమ్మెల్యేలు సహాయక చర్యల్లో పాల్గొన్నారని, వరద ప్రాంతాలను పరిశీలించారన్నారు. వరద బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారని చెప్పారు. వర్షాలు, వరదలపై మండలిలో ప్రభుత్వం ప్రకటన చేసింది. వర్షాలతో 139 గ్రామాల ప్రజలను, 157 సహాయక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. 7,870 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని, 756 చిన్న తరహా సాగునీటి చెరువులకు గండ్లు పడ్డాయని పేర్కొంది. చెరువుల పునరుద్ధరణకు రూ.171.1కోట్లు అవసరమని, 488 రాష్ట్ర రహదారులు, 29 జాతీయ రహదారులు పునరుద్ధరించినట్లు చెప్పింది. తాత్కాలిక పునరుద్ధరణకు రూ.253.77కోట్లు అవసరమని, శాశ్వత పునరుద్ధరణకు 1777.47 కోట్లు అవసరమని చెప్పింది. పంచాయతీరాజ్‌శాఖకు సంబంధించి 1517 రోడ్లు దెబ్బతిన్నాయని, తాత్కాలిక పునరుద్ధరణకు రూ.177.1కోట్లు అవసరమని తెలిపింది. శాశ్వత పనుల కోసం రూ.1339.03 కోట్లు అవసరమని పేర్కొంది. ఆగస్టు 8వ తేదీ వరకు తాత్కాలిక పునరుద్ధరణ పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేసింది.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215